




# వల

అడవికి దగ్గరగా వున్నవొక టౌన్‌లో ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌కు వాచ్‌మెన్ పోలయ్య. అతను గెస్ట్‌హౌస్ తన రాజ్యంగానే భావించాడు. రాజులాగానే అధికారం చెలాయించాడు. అయినా అతనికి చాలా వరకు ఎదురే లేకపోయింది.

ఎందుకంటే అతనికి, వలవేసి పై అధికారులను పట్టుకోగల నైపుణ్యం వుంది. వేటాడి తన శత్రువులను చంపగల శక్తి వుంది.

కొన్నాళ్ళకు, మొదటిసారిగా, అతనికి ఎదురు దెబ్బ తగిలింది. ఎవరో పెట్టిన పిటిషన్లపైన ఎంక్వైరీ జరుపమని వొక అధికారిని ప్రభుత్వం ఆదేశించింది.

ఆ అధికారి పేరు రంగారావు.

రంగారావుకు విక్కచ్చి మనిషన్న పేరుంది. ఎందుకంటే అతను లంచ గొండి కాదు. పైసా ముట్టడని పేరు.

కానీ రంగారావు బలహీనతలు పోలయ్యకు తెలుసు. అతను ఆ గెస్ట్‌హౌస్‌లో చాలాసార్లు మకాం చేశాడు.

కనుక రంగారావును వల విసిరి పట్టుకోగలనన్న ధైర్యంతో వున్నాడు పోలయ్య.

రంగారావు భోజన ప్రియుడు. మాంసాహారమంటే అతనుకి మహాప్రీతి. మాంసాహారానికి తోడు మద్యం, ఆ తర్వాత మగువవుంటే అతను మహదానందపడ్తాడు.

పోలయ్య అతనికోసం ఫారిన్ విస్కీ, బ్రాందీలు సిద్ధం చేసేడు. మంచి అమ్మాయిని అతనికోసం పట్టుకొన్నాడు. అంతవరకు బాగానే వుంది.

కానీ మాంసం దగ్గరే చిక్కొచ్చి పడింది.

కోడి పలావు, చికెన్ లు ఎక్కడైనా దొరుకుతాయి.

కానీ రంగారావును లొంగదీసుకోటానికి అవి చాలవు.

జింక అటవీ శాఖపై అధికారులెవరో అడవిలో కేంప్ వేసి వుండటం వల్ల పోలయ్యకు జింకనిచ్చే సాహసం చేయలేకపోయారెవ్వరు.

ఆ బాధతో రాత్రి నిద్ర పట్టలేదతనికి. తన భవిష్యత్తుపైన భయం పట్టుకొంది. తన కిరీటం కింద పడిపోయినట్లు, తను బజార్లో అడుక్కు తింటున్నట్టు అతనికి ఆ రాత్రంతా కలలు వచ్చాయి.

తెల్లవారికే రంగారావు వస్తాడు. ఎంక్వరీ చేస్తాడు.

ఎలా?

పక్కమీద పడుకోలేక బయటికొచ్చాడు.

అప్పటికింకా తెల్లవార లేదు. కను చీకటిగా వుంది.

అప్పుడు తనకంట్లో పడిందో అద్భుత దృశ్యం

ఎక్కడినుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో, ఎలా ఇరుక్కొందో, వొక జింక గెస్ట్‌హౌస్‌కు చుట్టూ వున్న ఇనుక కంచెలో యిరుక్కొని బయటపడటానికి గింజుకొంటోంది.

'నా అదృష్టదేవత. నా బుజ్జి తల్లీ. వస్తున్నా, నిన్ను రక్షించటానికి వస్తున్నా' అంటూ జింకకి నమస్కరించాడు. ఆ తర్వాత దాన్ని జాగ్రత్తగా బంధించి కిచెన్‌లోకి తీసుకెళ్ళేడు.

రంగారావు లంచ్ ముందు కూర్చున్నాడు.

టేబిల్‌మీద ఏర్పాటు చూసి ప్రసన్నంగా నవ్వేడు.

జింక మాసం నోట్లో పెట్టుకొన్నాడు. మొహం అదో విధంగా మారిపోయింది.

'మీ కోసం ప్రత్యేకంగా చేయించానయ్యా. ఇంకాస్త వేసుకోండి' అంటూ కొసరి కొసరి వడ్డించి తన గోడు చెప్పకో సాగేడు పోలయ్య.

'పోలయ్యా ఇది కోడి మాంసం కాదు. పందిమాంసం కాదు. మేక మాంసం కాదు. మరేం మాంసం?'

ఉబ్బి తబ్బిబ్బయ్యాడు పోలయ్య. ఇక ఎంక్వయిరీని గాలిలోకి గాలిలోకి ఎగరగొట్టినట్లే!

ఆ ఆనందంలో, ప్లేటులో పెట్టిన మాంసం ప్లేటులోనే వుందని గుర్తించ లేదు పోలయ్య.

'మీ కోసం స్పెషల్‌గా జింకను వేటాడి తెచ్చి వండేనయ్యా. బాగుంది కదా?'

రంగారావు చివాలున మంచం ముందునుంచి లేచాడు. చేయి కదుక్కొని సీరియస్‌గా రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

కంగారు పడిపోతూ పోలయ్య వెనుకనే వెళ్ళాడు.

'అయ్యా- నా వల్ల పొరపాటు ఏదన్నా జరిగితే క్షమించండయ్యా'

'పోలయ్యా మనిషికి బలహీనతతో పాటు బలాలుకూడా వుంటాయి.

నా బలహీనతలు నీకు తెలుసు. అందుకే జింక మాంసంతో నన్ను ప్రసన్నం చేసుకోవాలనుకొన్నావ్. కానీ నేను ప్రకృతిని ఆరాధిస్తాను. వన్యప్రాణులంటే నాకు ప్రాణం'.

తను విసిరిన వలలో తానే చిక్కుకున్నట్లు గిజగిజలాడిపోయాడు పోలయ్య!

—కప్పగంతుల మల్లిఖార్జునరావు

---

## మహనీయుల ముచ్చట్లు



### 420 రూలు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా వున్న రోజులలో పార్లమెంటు సభ్యులకు నెలకు 400 రూపాయలు గౌరవ వేతనం ఇచ్చేవారు. ఈ నాలుగు వందలు వారికి ఏమాత్రం సరిపోయేవి కావు. అయినా తమకు జీతం సరిపోవటం లేదని చెప్పే ధైర్యం ఎవరికీ వుండేది కాదు. కొన్నాళ్ళకు పార్లమెంటు సభ్యులు కాస్తంత ధైర్యం తెచ్చుకొని చివరకు తమ గోడును ఆనాటి న్యాయశాఖా మంత్రి జగన్నాథ్ కౌశల్ ద్వారా ప్రధానమంత్రి పండిట్ నెహ్రూకు మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు ఈ మొర ఆలకించిన పండిట్ నెహ్రూ ఓ 20 రూపాయలు పెంచి 420 చేయటానికి అంగీకరించారు.

అయితే ఈ 420కి ఒక అభ్యంతరం వచ్చిపడింది. భారత శిక్షా స్మృతిలో 420 సెక్షన్ అంటే మోసం చేయటం, దగా చేయటంగా చెప్పబడి వుంది. కాబట్టి పార్లమెంటు సభ్యులకు 420 జీతంగా నిర్ణయించితే జనం వీర్ని 420 (మోసం, దగా చేసే వాళ్ళు)లుగా ఎగతాళి చేస్తారేమో న్యాయశాఖా మంత్రి వివరించగా పండిట్ నెహ్రూ కూడా ఒకింత ఆలోచించి - అదీ నిజమే - సరే అయితే ఎం.పి.ల జీతం 421గా చేద్దామని చెప్పారట!

—వేమూరి జగపతిరావు